క్లుప్తంగా

మదనపల్లె డీవైఈఓగా లోకేశ్వరరెడ్డి



మదనపల్లె సిటీ: మదనపల్లె డీవైఈఓ(ఫుల్ అడిషనల్ చార్జ్)గా పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు మదనపల్లె డీవైఈఓగా ఉన్న కుమార్‌ను తిరుపతి డీఈఓతో పాటు అదే కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో ఖాళీగా ఏర్పడిన మదనపల్లె డీవైఈఓ స్థానంలో లోకేశ్వరరెడ్డిని నియమించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతన డీవైఈఓకు డివిజన్‌లోని ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మైనారిటీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లె : రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీలకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు రూ.5లక్షల వరకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి 24 యూనిట్లు మంజూరు కాగా ఇండియన్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మదనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో సబ్సిడీ రుణాల యూనిట్లు రూ. 1, లక్ష, రూ. 3 లక్షలు,రూ. 5 లక్షలు గా ఉన్నాయన్నారు. ఎంపికైన వారికీ 50 శాతం సబ్సిడీతో రుణం మంజూరవుతుందన్నారు. 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వయసు కలిగి ఆసక్తి ఉన్న మైనారిటీలు ఏపీఓబిఎంఎంఎస్.ఏపీసిఎఫ్ఎస్ వెబ్ సైట్ లో ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో మూడు సెట్లును అందించాలన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సుగవాసి మృతి తీరనిలోటు



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతి తీరనిలోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మాజీ ఎంపీ మృతి సమాచారంతో వారి స్వగృహానికి చేరుకుని సుగవాసి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో తనకున్న రాజకీయబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో తనముద్ర వేసిన ఘనత ఆయనకు దకుకతుందన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

పుల్లంపేట : మండల కేంద్రమైన పుల్లంపేట పంచాయతీలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. అలానే భావనారుషి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున వీధులు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సర్పంచ్ సూచించారు. అలానే గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ నూర్జహాన్ పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా ఫాం పాండ్ పనులను పరిశీలించడమే కాకుండా అక్కడ కూలీలు మస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న కూలీలను పేరుపేరున మస్టర్‌లో పిలవడం జరిగింది. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఒకరి పనులు ఒకరు చేయకుండా ఒకరు పేరు మీద మరొకరు పనులకు రాకూడదని సూచించారు. ఉపాధి పనుల్లో ఎవరైనా ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడవ రోజుకు చేరిన కార్మికుల నిరసన

రాజంపేట : అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమం మూడవ రోజుకు చేరింది. ఏపీఎన్‌జీఓ జేఏసీ అధ్యక్షుడు శెట్టం వెంకటరమణ కార్మికుల నిరసనకు మద్దతు పలికారు. గత కొద్దినెలలుగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న నిరసనలను ప్రభుత్వం గుర్తించి, వారికి చట్టబద్ధంగా పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ 60 సంవత్సరాల నిర్ణయంతో మున్సిపాలిటీలో ముగ్గురిని తొలిగించారన్నారు. వారిని ఒట్టిచేతులతో ఇంటికి పంపించేశారన్నారు. నిరసనలో కార్మిక నేతలు పీవీ రమణ, లక్ష్మీప్రసాద్, రమణ, రాము, సుదీర్, ప్రమీల, బుజ్జమ్మ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీభవన్‌వీధిలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య కన్యలు కలశాలతో గంగను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఓ చిన్నారి వాసవీ అమ్మవారి వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. అర్చకులు గంగతో అమ్మవారికి అభిషేకం చేశారు. స్వస్తివాచనం, కలశస్థాపన, నవగ్రహపూజ,అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారికి పుష్పపల్లకీపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి గిరిధర్, ప్రవీణ్,రాజేష్, వాసవీ మహిళా సంఘం, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి

రామసముద్రం: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు , హోమాలు చేశారు. మహిళలు అమ్మవారి కీర్తనలు పాడి వినిపించారు. ప్రతి ఏటా అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.



మదనపల్లెలో కలశాలతో గంగను తీసుకువస్తున్న ఆర్యవైశ్యులు



పీలేరు: పుష్పపల్లకీలో అమ్మవారి ఊరేగింపు

పీలేరులో..

పీలేరు : స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, కన్యకల పూజ నిర్వహించారు. వడి బియ్యం, హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పీలేరు పుర వీధుల్లో అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్, వాసవీ కపుల్స్ క్లబ్, వాసవీ గ్రేటర్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: స్థానిక కన్యకాపరమేశ్వరీ జయంతి సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహానికి నగలు, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించగా భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.



ప్రత్యేక అలంకరణలో వాసీవ అమ్మవారు



రామసముద్రంలో..

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్య పంటల దిగుబడి

తంబళ్లపల్లె : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటల దిగుబడి సాధించి లబ్ధి పొందవచ్చునని ఏఓ రమణకుమార్ తెలిపారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో మండలస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, పంటలసాగు, దిగుబడి, చీడపీడల నివారణకు కషాయాల వాడకం తదితర అంశాలపై ఆర్ఎస్‌కే సిబ్బంది వివరించారు. మహిళాసంఘాల్లోని సభ్యులు ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్ ప్రణాళికను కచ్చితంగా అమలుపరిచేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, డీఎంఎంటీ సుబ్బరామ్, యూనిట్ ఇన్‌చార్జ్ రాజు, మహిళాసంఘ గ్రూపులీడర్లు, రైతులు పాల్గొన్నారు.

దేశ భద్రతకే మొదటి ప్రాధాన్యత

కలకడ : బీజేపీ దేశ భద్రతకే మొదటి ప్రాదాన్యత ఇస్తుందని పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ నాయుడు అన్నారు. బుధవారం కలకడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో దేశాభివృద్ధి సాధించడమే బీజేపీ లక్ష్యమన్నారు. పాక్ కవ్వింపు చర్యలను తిప్పికొట్టే సత్తా భారత్ సైన్యానికి ఉందన్నారు. భారత్‌లోని పట్టణాలు, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికే పాకిస్తాన్ ప్రయత్నం చేస్తున్న విషయం నేడు ప్రపంచం మొత్తం గుర్తించిందని గుర్తు చేశారు. దేశభద్రతలో నరేంద్రమోదీ సర్కార్ వెనుకంజ వేయదని, ఎలాంటి చర్యలకైనా భారత్ సైన్యం సిద్ధంగా ఉందన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ

ఏడీఏ కె.శివశంకర్



మదనపల్లె రూరల్ : అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద మే నెలాఖరులో రాష్ట్రప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.20వేలు మూడువిడతల్లో జమ చేయనున్న సందర్భంగా రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మదనపల్లె వ్యవసాయశాఖ ఏడీ కే.శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రప్రభుత్వం రూ.14వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు మూడువిడతల్లో రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రైతులు సమీప రైతుసేవా కేంద్రాలను సందర్శించి తమ ఆధార్ నెంబర్, రైతుల పొలం విస్తీర్ణం, వెబ్ ల్యాండ్‌లోని వివరాలతో సరిచూసుకుని, ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసేవారు, స్థానిక సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసేవారు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కాదన్నారు. నెలకు రూ.10వేలు లేదా అంతకంటే ఎక్కువ పెన్షన్ తీసుకునేవారు అనర్హులేనన్నారు. అయతే మల్టీ టాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4, గ్రూప్-డి ఉద్యోగులకు మినహాయింపు ఉందని, వారు ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. ఇన్‌కంటాక్స్ కట్టేవారు, రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతున్న ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీచైర్మన్ తదితరులకు పథకం వర్తించదని తెలిపారు.

పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె : ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో పండ్ల తోటల పెంపకానికే ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏపీడీ నందకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం శ్రీశక్తి భవన్‌లో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధిపనులు, పాల్గొంటున్న కూలీలు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు...రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారికి ఉపాధిహామీ పథకం ద్వారా పండ్లతోటలు పెంచుకునే విధంగా ప్రోత్సహించి లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి, ఏపీఓ అంజనప్ప పాల్గొన్నారు.

వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మదనపల్లె సిటీ: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య,వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీసెంట్‌హాలులో తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 17వతేదీ నుంచి 26వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల పక్షాన నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్యం చేస్తామన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధి అవకాశాల కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, జయబాబు, ప్రేమ్ తదతరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నగదు బహుమతులు



మాట్లాడుతున్న డీఎం అమర్‌నాథ్

మదనపల్లె సిటీ: సంస్థలో ప్రతిభకబరిచిన ఉద్యోగులకు నగదు బహుమతులు అందజేస్తామని ఆర్టీసీ -1 డిపో ఇన్‌చార్జ్ డీఎం అమరనాథ్ అన్నారు. బుధవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఏప్రిల్ నెలలో ఈపీకె 43.59, ఓఆర్ 79.57 శాతంతో రీజియన్‌లో మొదటి స్థానం నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. అందరూ కష్టపడి పనిచేసి ఆదాయం పెంచాలన్నారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెప్పనాయుడు కాలనీలో రోడ్డు ఆక్రమణలు

- 20 అడుగుల రోడ్డు 9 అడుగులకు కుదింపు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, పూలచెట్లు
- ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కాలనీరోడ్డులో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

మదనపల్లె రూరల్ : పట్టణంలో మోడల్ కాలనీగా పేరుమోసిన రాటకొండ రెడ్డెప్పనాయుడు కాలనీలో రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలనీలోని కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా ఇళ్ల ముందు కార్లు, వాహనాలు పార్కింగ్ చేయడం, పూలచెట్లు పెంచడం, కుండీలు రోడ్డుపై ఏర్పాటుచేయడంతో ఇతరులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలనీలో 20 అడుగులు ఉండాల్సిన రోడ్డు కాస్తా...9 అడుగులు మాత్రమే మిగలడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా, వారు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింత చెలరేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ఆక్రమణలతో తరచూ గొడవలకు దిగాల్సి వస్తోందని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదుచేస్తే, వారు అంశం తమ పరిధిలోది కాదని, మున్సిపల్ అధికారులకు తెలపాల్సిందిగా సూచించారన్నారు. అయితే మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని వాపోయారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేందస్వామి ఆరాధనత్సోవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, స్వామికి పంచామృతాభిషేకం, ఆరాధన మహోత్సవం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లక్ష్మినారాయణాచారి,నవయుగ స్వర్ణకార సంఘ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి,సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉచిత వైద్యం ఆదర్శనీయం

రాజంపేట రూరల్ : గ్రామస్థాయిలో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామీణులకు చేయూత నివ్వడం ఎంతో ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లి సచివాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్ దాసరాజు వెంకటరాజు ఆధ్వర్యంలో తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామీణ ప్రజలకు వైద్య బృందం అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. శిబిరంలో వందలాది మందికి వైద్యం అందించి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని తిరుపతికి వచ్చి వైద్యం చేయించుకోవల్సిందిగా సూచించారు. ఈ ఉచిత శిబిరంలో ఎంపీటీసీ ఎ.వరదరాజు(బాబు), వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు శ్రీను, రఘు, చంద్రమోహన్‌రాజు, గీతాల నరసింహారెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, జీవీ సుబ్బరాజు, దండు గోపీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే ఉత్పత్తిదారుల సంఘాలు

గాలివీడు : వ్యవసాయంలో మెరుగైన సేవలు అందించి, రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెరి సంస్థ ఇన్‌చార్జి కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామంలో నాబార్డు, నాఫెడ్ కేంద్ర ప్రభుత్వం , రైతుల భాగస్వామ్యంతో టెరి సంస్థ ప్రోత్సాహంతో రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ నారే మల్లికార్జున నాయుడు, కార్యాలయ సిబ్బంది సీఈఓ శారద, వెంకట మహేష్ కుమార్, బీఓడీ సభ్యులు నగేశ్వర్ నాయుడు, చిన్నరెడ్డప్ప నాయుడు, మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో రక్షణ కోసమే మాక్ డ్రిల్

గాలివీడు : విపత్కర పరిస్థితుల్లో తమతో పాటు తోటివారిని రక్షించడం కోసమే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు రాయచోటి ఆర్డీఓ శ్రీనువాసులు, లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తూముకుంట గ్రామం సోలార్ పవర్ ప్లాంట్‌లో అగ్నిమాపక సిబ్బందితో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత, అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ప్రవర్తించాలో అందరూ తెలుసుకోవడం కోసమే అవగాహన కల్పించామన్నారు. అంతేగాక తమ చుట్టూ అనుమానాస్పదంగా ఎవరైనా, ఏమైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉచిత కంటిపొర చికిత్స శిబిరానికి స్పందన

- 63 మందికి కాట్రాక్ట్ సర్జరీలు
- 655 మందికి కంటి పరీక్షలు



ఉచిత కంటిపొర చికిత్స శిబిరంలో సర్జరీ చేసుకున్న వ్యక్తితో శంకర్ నేత్రాలయ సిబ్బంది

మదనపల్లె రూరల్ : శంకర్ నేత్రాలయ మొబైల్ ఐ సర్జికల్ యూనిట్, పుట్టపర్తి, ఏఆర్ఎస్ఆర్ చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని జీఆర్‌టీ హైస్కూల్‌లో పదిరోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటిపొర చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం శిబిరం ముగింపు సందర్భంగా కాట్రాక్ట్ సర్జరీలు చేసుకున్న వారికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మందులు ఏ విధంగా వాడాలని సూచనలు తెలిపామన్నారు. ఏప్రిల్ 28న ప్రారంభమైన ఉచిత కంటిపొర చికిత్స శిబిరంలో మే 5వ తేదీవరకు సుమారు 700 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కంటిలో ఉన్న శుక్లం ఉన్న వారిని 63మందిని గుర్తించామన్నారు. వారికి బుధవారం వరకు కాట్రాక్ట్ సర్జరీలు నిర్వహించి, ఐఓఎల్ లెన్స్, కంటిఅద్దాలు, మందులు ఉచితంగా అందించామన్నారు. శిబిరం వద్దే శంకర్ నేత్రాలయ మొబైల్ ఐ సర్జికల్ యూనిట్‌లో నిపుణులైన వైద్యులతో విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తిచేశామన్నారు. కంటిలోపల సమస్య తీవ్రంగా ఉన్న వారిని బేస్ హాస్పిటల్‌కు సిఫారసు చేశామన్నారు. పదిరోజుల పాటు ఉచిత కంటిపొర చికిత్స శిబిరం విజయవంతానికి ప్రత్యక్ష, పరోక్ష సహాయసహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా సేవలందించిన వలంటీర్లకు ధన్యవాదాలు చెప్పారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

వాల్మీకి మహాసేన అధ్యక్షుడు హరికృష్ణ



జిల్లా వాల్మీకి మహాసేన నూతన కార్యవర్గ సభ్యులు

మదనపల్లె రూరల్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంతవరకు పోరాటాలు చేస్తామని వాల్మీకి మహాసేన అధ్యక్షులు ముత్తరాసి హరికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాసి హరికృష్ణ, ఉపాధ్యక్షులు చిన్నరాయప్ప ఆధ్వర్యంలో అన్నమయ్యజిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. వాల్మీకి మహాసేన అన్నమయ్యజిల్లా అధ్యక్షులుగా దేవపట్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా యనమల నవీన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామీణ మండలాల్లో ఉంటున్న వాల్మీకి సోదరుల సంక్షేమమే ధ్యేయంగా అన్నమయ్యజిల్లా నూతనకమిటీ పనిచేస్తుందని రాష్ట్ర వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మిద్దింటి రవికిరణ్, రాగిమేకలపల్లె శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి బొగ్గిటికృష్ణమూర్తి, నిమ్మనపల్లె హరి, మణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై వెంకన్న



సింహవాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ: శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సింహవానం భక్తులకు దర్శనమిచ్చారు. దిగువకమ్మపల్లెవాసులు ఉయభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఆలయంలో అభిషేకం,హోమాలు జరిగాయి. నెహ్రూబజార్, త్యాగరాజవీధి, గుండ్లూరువీధి, రాఘవేంద్రరావువీధి, దేవళంవీధికి చెందిన ఉభయదారులుగా వెంకటరమణస్వామి హనుమంతవాహనంపై పురవీదుల్లో ఊరేగించారు. ఆలయం గోవింద నామస్మరణలతో మ్మార్మోగింది. వాహన సేవలను భక్తులు కనులా వీక్షించారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు,బింగి నాగేంద్ర, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ స్టార్ స్పీకర్‌గా నాయబ్ షైమ



విజేతగా సర్టిఫికెట్ అందుకుంటున్న నాయబ్ షైమ

మదనపల్లె రూరల్ : ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్, స్టార్ స్పీకర్ కంటెస్ట్–2025లో భాగంగా తిరుపతి, అన్నమయ్య రీజియన్‌లో మే 4,5 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన నాయబ్ షైమ విజేతగా నిలిచింది. వివిధ రంగాల్లో ఉత్తీర్ణులైన మొత్తం 39మంది ప్రొఫెషనల్స్ పోటీల్లో పాల్గొంటే...అందులో 7 మంది జోనల్ లెవెల్ స్టార్ స్పీకర్లుగా ఎంపికయ్యారు. వారిలో నాయబ్ షైమ ఒకరు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న నాయబ్ షైమ, చిన్నవయస్సులో మంచి వక్తగా రాణిస్తూ, తనకంటే మూడింతలు వయస్సులో పెద్దవారితో దీటుగా అద్భుతమైన ప్రదర్శనతో కాంటెస్ట్‌లో విజేతగా నిలిచి అందరి ప్రశంసలు పొందింది. తిరుపతి, అన్నమయ్యరీజియన్-14లో జరిగిన కార్యక్రమానికి ప్రో లీడర్‌గా తహసున్నీసా బేగం, ఆర్గనైజర్‌గా తబిత దేవరపల్లె, న్యాయనిర్ణేతలుగా ఇంపాక్ట్ సీనియర్ ట్రైనర్ మారోజు రమేష్ తదితరులు వ్యవహరించారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ నాటకం



దుర్యోధన-భీముడి యుద్ధ నాటిక సన్నివేశ దృశ్యం

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం నిర్వహించిన దుర్యోధన వధ నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. మండలంలోని బాలయ్యగారి పల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలోమాజీ సర్పంచ్ రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహాభారత యజ్ఞం చివరిరోజు కావడంతో భీముడు-దుర్యోధనుడు పోరాటం చేసిన కళ ఎంతో ఆనందాన్ని పంచింది. ఒకవైపు వర్షం కురుస్తున్నా ప్రేక్షకులు కదలకుండా ఉండటంతో కళాక్షేత్రంలోనే నాటకం పూర్తి చేశారు.